క్లుప్తంగా

జీపీ కార్మికుల నిరసన

ఎలిగేడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట జీపీ కార్మికులు నిరసన చేపట్టారు.
ధర్మారం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు కటికెనపల్లి గ్రామంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను హరించి వేయడాన్ని నిరసిస్తూ హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో సోమవారం జీడీకే–2వ గనిలో లేబర్ కోడ్ల ప్రతులను తగలబెట్టారు.

గీత కార్మికున్ని ఆదుకోవాలి

ఎలిగేడు: ముప్పిరితోట గ్రామానికి చెందిన రంగు కొమురయ్య(55) అనే గీత కార్మికుడు ఈనెల 22న సాయంత్రం తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. తోటి గీత కార్మికులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వం గీత కార్మికున్ని ఆదుకోవాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం న్యాయ సలహాదారుడు చీకటి సంతోష్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పూరెళ్ల మొండయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు చీకటి వీరస్వామిగౌడ్ కోరారు.

కమిషనర్‌ను నియమించండి



అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందిస్తున్న రఫిక్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీకి బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫిక్ కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం వారి చాంబర్‌లో కలిసి విన్నవించారు. కనీసం ఇన్‌చార్జి బాధ్యతలు మేనేజర్, పక్కనున్న మున్సిపల్ అధికారులకు అప్పగిస్తే బాగుండేదని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ జనన, మరణ సర్టిఫికెట్లు, పలు రకాల ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.

వేధింపులకు గురి చేస్తే సమాచారమివ్వండి

సుల్తానాబాద్: కళాశాల విద్యార్థులను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే షీటీంకు సమాచారమివ్వాలని ఏఎస్ఐ మల్లన్న కోరారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీవాణి కళాశాలలో విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. షీటీం సిబ్బంది సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

మంథని: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలు గడుస్తున్నా.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ముత్యంరావు అన్నారు. మంథని విద్యార్థి యువత కార్యాలయంలో మంథని శాఖ మహాసభ నిర్వహించారు. శాఖ కార్యదర్శి బూడిద గణేశ్, నాయకులు ఆర్ల సందీప్, ఏల్పుల సురేశ్, రవి, గొర్రంకల సురేశ్, మౌర్య, సమ్మయ్య తదితరులున్నారు.


చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ సాగునీరు

ముత్తారం: ఖమ్మంపల్లి, సీతంపల్లి, ఇప్పలపల్లి చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ సాగునీరందించాలని స్థానికుల విన్నపం మేరకు మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని మాజీ జెడ్పీటీసీ సదానందం తెలిపారు.

మంత్రికి సన్మానం

ముత్తారం: ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడానికి రాష్ట్రంలోనే అడవిశ్రీరాంపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మంత్రి శ్రీధర్‌బాబును సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, స్థానిక మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి సన్మానించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



కుక్కలగూడురులో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కందుల సంధ్యారాణి

పాలకుర్తి: కుక్కలగూడుర్, రామారావుపల్లి గ్రామాల్లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పాల్గొని మాట్లాడారు. స్థానికులతో పార్టీ సభ్యత్వం నమోదు చేయించారు. నాయకులు పిడుగు కృష్ణ, మేడం రాజు, గోపు రామయ్య, కోడూరి వెంకటేశ్, పత్తిపాక సుధాకర్, మెండ అంజి, రంజిత్, చల్ల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.
జూలపల్లి: పెద్దాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదును మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ ప్రారంభించారు. ప్రతీ ఒక్కరు బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. భద్రయ్య, అంజన్న, నర్సయ్య, తీగెల అశోక్, ఆంజయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పోలీస్ స్టేషన్ ఆవరణ శుభ్రం చేస్తున్న సీఐ, సిబ్బంది, బల్దియా అధికారులు



పెద్దపల్లిరూరల్: ట్యాంకుబండ్ పరిసరాలు శుభ్రం చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

కోల్‌సిటీ: స్వచ్ఛతాహీసేవా–2024 కార్యక్రమంలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏఎస్సై మల్లేశం, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, నగరపాలక సంస్థ హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

పెద్దపల్లిరూరల్: స్వచ్ఛత, పరిశుభ్రతను ప్రతీ ఒక్కరు పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ సూచించారు. పెద్దపల్లిలోని మినీ ట్యాంకుబండ్‌పై సోమవారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛతాహీసేవా కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, చెత్తాచెదారం తొలగించారు. హిందూ శ్మశాన వాటికలో మొక్కలు నాటారు.

కళాశాలలో..

పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణను అధ్యాపకులు, విద్యార్థులు శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ మైత్రేయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నరహరి, అధ్యాపకులు సంతోష్‌రెడ్డి, అశోక్, రామకృష్ణ, కుమారస్వామి, రమాదేవి, ప్రసూన, శ్రీలత అశ్విని, దీప, పుష్పలత తదితరులున్నారు.

రామగుండంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పెద్దపల్లిరూరల్: కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ చూపడంతో పెద్దపల్లిలో కార్యాకలాపాలు నిర్వహిస్తున్న రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం త్వరలోనే రామగుండం తరలిపోనుంది. ఇందుకోసం అధికారులు అవసరమైన ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. రామగుండంలోని ఐకేపీ భవన్‌లో ఇందుకోసం ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేశారు. ఇందులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు అవసరమైన పనులన్నీ పూర్తయ్యాయి. అయితే కార్యాలయంలో కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర సాంకేతిక సామగ్రి కొనుగోలుకు నిధులు మంజూరు కాకపోవడంతో పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు ఆవరణలోనే ఇప్పటిదాకా ఉండిపోయింది.

ప్రత్యేకంగా నిధులు

కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈనెల 13న ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్య గుర్తించారు. వెంటనే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. కంప్యూటర్ ఇతర సామగ్రి కొనుగోలుకు ఆదేశించారు. దీంతో కొద్ది రోజుల్లోనే పెద్దపల్లి నుంచి రామగుండంలోని సొంత భవనంలోకి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసును తరలిస్తాం. రామగుండం ప్రాంత ప్రజలకు అక్కడే సేవలు అందిస్తాం.

– తిరుపతి, రామగుండం సబ్‌రిజిస్ట్రార్

క్రైం కార్నర్..

చికిత్స పొందుతూ ఒకరు మృతి



లక్ష్మణ్(ఫైల్)

ధర్మారం: దొంగతుర్తి గ్రామానికి చెందిన కునారపు లక్ష్మణ్(36) ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. పురుగుల మందు దుకాణం యజమాని పురుగుల మందు విక్రయించడంతోనే లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ శవాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు దొంగతుర్తిలోని దుకాణం ముందుకు తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. స్థానిక ఎస్సై శీలం లక్ష్మణ్ జోక్యంతో ఆందోళన విరమించారు. మద్యానికి బానిసైన లక్ష్మణ్ ఈనెల 19న సాయంత్రం పురుగుల మందు తాగగా.. కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చిక్సిత పొందుతూ మరణించాడని మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. లక్ష్మణ్‌కు కుమారుడున్నాడు.

వృద్ధుడు..

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు చందపల్లికి చెందిన గంగుల శంకరయ్య(73) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. కొంతకాలంగా శంకరయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆ బాధ భరించలేక ఆదివారం పురుగుల మందు తాగాడన్నారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడి కుమారుడు కేశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి దుర్మరణం

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారి పక్కనున్న చెట్టును ప్రమాదవశాత్తు ఢీకొని సామల రాజు(30) మృతిచెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన సామల రాజు కూలి పని చేస్తూ పెద్దపల్లిలో నివాసముంటున్నాడు. పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఆదివారం ఉదయం వెదిరకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రాత్రి ప్రమాదవశాత్తు చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి పది సంవత్సరాల్లోపు ముగ్గురు పిల్లలున్నారు.

మహిళ అదృశ్యం

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్య కాలనీలో నివాసముంటున్న కలవేన శ్యామల(35)కు భర్త రాజ్‌కుమార్‌తో కొద్ది రోజులుగా విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఆమె భర్తకు దూరంగా ఉంటోంది. సోమవారం భర్త ఇంటికి రాగా.. ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఆమె ఇంట్లో నుండి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. మహిళ తండ్రి మురుసు రాజకొమురయ్య ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

వీధి దీపాల్లేక ఇక్కట్లు



చెట్ల కొమ్మలతో ఇరుగ్గా రహదారి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం నుంచి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా పాలకుర్తి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగకపోవడంతో రహదారిపై పయనించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ, అక్కడి నుంచి పాలకుర్తి గ్రామం వరకు స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సమీపంలోని చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో అవి ఎక్కడికక్కడ తెగిపోయాయి. దాదాపు రెండు నెలలు కావస్తున్నా.. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ప్రధాన రహదారిపై వీధి దీపాల్లేక రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరోవైపు రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి రహదారి ఇరుగ్గా మారింది. ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు అమర్చి పిచ్చి మొక్కలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

గోదావరిఖనిటౌన్: మంచి పౌరులుగా ఎదగాలంటే స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో సాధ్యమని రామగుండం మండల విద్యాధికారి ఆరెపెల్లి రాజయ్య అన్నారు. జిల్లా అసోసియేషన్ ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్థానిక శారదానగర్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ ఫర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమంలో సోమవారం ఎంఈవో ముందుగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్యాంపులోని టెంట్స్‌ను సందర్శించి విద్యార్థులను వివరాలడిగి తెలుసుకున్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

మంథని: మంథనిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రమ ప్రారంభించారు.

తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: వాతావరణ మార్పులతో వరి పంటకు వివిధ రకాల తెగుళ్లు సోకుతున్నాయని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకొని నివారణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జున సూచించారు. పెద్దంపేట గ్రామంలో సోమవారం వరి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు.

రోడ్లను వెడల్పు చేయాలి

ఓదెల: ఓదెల గ్రామంలో ప్రధాన రహదారికిరువైపు ఉన్న రోడ్లను వెడల్పు చేయాలని గ్రామానికి చెందిన విశ్వహిందూ ప్రతినిధులు తాటికొండ వెంకటేశ్వర్లు, తాటికొండ కృష్ణమాచారి తహసీల్దార్ యాకన్నకు వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలు



జ్యోతినగర్: సాయి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జ్యోతినగర్: రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని సాయి సేవాసమితి ఆవరణలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీపీసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
గోదావరిఖనిటౌన్: స్థానిక అమ్మ పరివార్ ఆశ్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గంగానగర్ పట్టణ కమిటీ అధ్యక్షుడు అచ్చెవేణు ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 37వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రానికి బీఆర్ఎస్ నాయకుడు చెలుకపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూలర్ అందజేశారు.
యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ యైటింక్లయిన్ కాలనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాలనీ అల్లూరు గ్రామంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ ఆవరణలో బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ముల్కల కొంరయ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు.
కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో సోమవారం బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ముద్దసాని సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. బీఆర్ఎస్ లక్ష్మీనగర్ పట్టణ అధ్యక్షుడు నూతి తిరుపతి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

తాగునీటి సహాయకులకు శిక్షణ

రామగుండం: అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన తాగునీటి సహాయకులకు సోమవారం నుంచి మూడు రోజుల శిక్షణ శిబిరంలో భాగంగా మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ సునీల్ అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై సూచనలు, సలహాలిచ్చారు. ఎంపీడీవో ఎంఏ అలీం తదితరులున్నారు.

15 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

సుల్తానాబాద్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే అక్టోబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నట్లు మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గౌరవ వేతనం రూ.10వేలు చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం సరికాదన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

సుల్తానాబాద్: జిల్లాలోని రైతు వేదికల్లో సాగు సూచనలపై వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. పంటల్లో వచ్చే తెగుళ్లు, నివారణ సూచనలు ఇవ్వనున్నట్లు, రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఐక్యతతోనే ఏకగ్రీవ ఎన్నిక

సుల్తానాబాద్: సంఘం ఐక్యతతోనే ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. సుల్తానాబాద్ మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా పూసాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శశివర్ధన్, కోశాధికారిగా మేరుగు హరీశ్ ఎన్నికయ్యారు.

కాంట్రాక్టు కార్మికులకు అండగా ప్రభుత్వం

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని సీనియర్ నాయకుడు దీటి బాలరాజ్ పేర్కొన్నారు. సోమవారం మైవింక్లయిన్ చౌరస్తా కార్మికుడి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు జనగామ శ్రీనివాస్, ఓరుగంటి కృష్ణ, ఉల్లంగుల రమేశ్, మోయిను సన్నీ, తుమ్మల చంద్రశేఖర్‌గౌడ్, చిగురు సాయి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఎంపిక

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ జాతీయ అవార్డ్–2024కు ఎంపికయ్యాడు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్ 6న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే అవార్డుల ప్రదానం కార్యక్రమంలో దినేశ్‌కు బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రకటించారు.

ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి

ధర్మారం: హైదరాబాద్‌లో ఈనెల 30న నిర్వహించనున్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. కారుకురి శ్రీనివాస్, మొగురం మీరియా, అంగిడి కుమార్, మొగిలి సతీశ్, గోగర్ల మల్లేశం, స్వాతి, కవిత నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాలకుర్తి: బసంత్‌నగర్‌కు చెందిన నిరుపేద యువతి ఫర్హీన్ అనే మైనార్టీ యువతి వివాహానికి సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి బసంత్‌నగర్‌లోని అమ్మమ్మ వద్ద ఉంటున్న ఫర్హీన్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. ఎంజీఎఫ్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ వజహాతుల్లా ద్వారా తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ప్రతినిధులు రూ.68వేలను సేకరించి యువతి అమ్మమ్మకు అందజేశారు.



గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో కొన్ని నెలలుగా ట్రాఫిక్ సిగ్నళ్లు పని చేయడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. వెంటనే స్పందించి ట్రాఫిక్ సిగ్నళ్లు పునరుద్ధరించాలి.

– పి.రాకేశ్‌యాదవ్, రాంనగర్, గోదావరిఖని

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి ట్రాఫిక్ సీఐ, సెల్ నం: 8712656580

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్: 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



తెలంగాణ చౌరస్తా నుంచి హనుమాన్‌నగర్ వెళ్లే రోడ్డు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా సింగరేణి వారి ఆధ్వర్యంలో నిర్మించిన స్థానిక తెలంగాణ చౌరస్తా నుంచి హనుమాన్‌నగర్‌కు వెళ్లే రహదారి ఇరుగ్గా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై ఒక ఆటో వెళ్లేందుకు సరిపడా రోడ్డు ఉంది. ఎదురుగా వచ్చే బైక్ కూడా రోడ్డు కింది నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుకిరువైపులా గుంతలుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హనుమాన్‌నగర్‌లో ఉన్న రెండు ప్రైవేట్ పాఠశాలలు, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. చౌరస్తాకు సమీపంలో ఉన్న ఒక బార్, ఒక వైన్స్‌షాపులకు ఇదే రోడ్డు నుంచి వెళ్లే మందుబాబులతోపాటు వాహనదారులు తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్జీ–2 ఏరియా సింగరేణి యజమాన్యం, అధికారులు స్పందించి రోడ్డును విస్తరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

మోసం చేయడంలో కాంగ్రెస్ అగ్రగామి

గోదావరిఖని: కార్మికులను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ అగ్రగామిగా నిలిచిందని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరిట సింగరేణి కార్మికులను నిండా ముంచిందన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహించి సింగరేణి సంస్థను బీఐఎఫ్ఆర్‌లోకి తీసుకెళ్లేలా చేసింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. ఒకప్పుడు 1.17లక్షల మంది కార్మికులతో కళకళలాడిన సింగరేణి సంస్థను గోల్డెన్ హ్యాండ్ షేక్, వాలంటరీ రిటైర్మెంట్, డిస్మిస్ పేరిట వేలాది మంది కార్మికులను ఇంటికి పంపించి ఇప్పుడు సుమారు 40వేలకు కుదించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలోని బొగ్గు గనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి హైదరాబాద్ కేంద్రంగా బీజేపీ ప్రభుత్వం ప్రారంభించిన వేలం పాటకు స్వాగతం పలికిన కాంగ్రెస్ తీరును కార్మికులు గమనించాలని ఆయన కోరారు. కొత్త బొగ్గు గనుల సాధనకు ప్రభుత్వం కృషి చేయకుండా సింగరేణిపై అజమాయిషీ చేయడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, చల్ల రవీందర్‌రెడ్డి, పోలాడి శ్రీనివాసరావు, దూట శేషగిరి, మహిపతిరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్తి లాభాల్లో వాటా చెల్లించాలి

గోదావరిఖని: ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించి పూర్తి లాభాలు రూ.4,701కోట్లలో 33 శాతం వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. సోమవారం ఓసీపీ–1 సైటాఫీస్, బేస్‌వర్క్‌షాప్, ఎస్అండ్‌డీ సెక్షన్స్‌లో కార్మికులకు నల్ల బ్యాడ్జీలు పెట్టి నిరసన తెలిపారు.

దుష్ప్రచారం సరికాదు

రామగిరి: సింగరేణి కార్మికులకిచ్చే లాభాల వాటాపై కొన్ని యూనియన్లు దుష్ప్రచారం చేయడం సరికాదని ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ వై.వి.రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. జూపాక రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

రామగిరి: యాజమాన్యం కార్మికులకు ప్రకటించిన లాభాల వాటాల్లో మోసం జరిగిందని, వాస్తవ నికర లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏలో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. ఏరియా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

నాయకుల ఆందోళన

గోదావరిఖని: కార్మికులకు పూర్తిస్థాయి లాభాల వాటా చెల్లించాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్జీ–1, 2 ఏరియాలోని అన్ని గనులపై సోమవారం ఆందోళన నిర్వహించారు. నాయకులు ఐలి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సత్యం, బేతి చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

రామగిరి: చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. 54 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రెనీ పోస్టులకు నిర్వహించిన పరీక్షలో ఎంపికైన 8 మంది అభ్యర్థులకు స్థానిక ఎంవీటీసీలో శిక్షణ ఉత్తర్వులను అందజేసిన అనంతరం మాట్లాడారు. ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, డీవైపీఎం శ్రీహరి, డీఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దీపావళి బోనస్‌పై 29న సమావేశం

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల దీపావళి బోనస్(పీఎల్ఆర్)పై ఈనెల 29న న్యూఢిల్లీలో జేబీసీసీఐ స్టాండర్డయిజేషన్ కమిటీ సమావేశం జరుగుతుందని బీఎంఎస్ అధ్యక్షుడు సత్తయ్య తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుడికి న్యాయం చేయండి

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1లో ప్రమాదానికి గురైన కాంట్రాక్టు కార్మికుడు ఆడెపు శ్రీకాంత్‌కు న్యాయం చేయాలని ఐఎన్టీయూసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్క నాటుతున్న ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, మొక్కలు నాటి సంరక్షించినప్పుడే భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించగలమని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. సోమవారం సెంటనరీకాలనీ సింగరేణి పార్క్‌లో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 నిర్వహించగా.. ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి అక్టోబర్ 31 వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి మొక్కలు నాటుతామన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్సీ రెడ్డి, ఐఎన్టీయూసీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, అధికారులు రాజశేఖర్, బి.వి.సత్యనారాయణ, ఐలయ్య, రాజేంద్రప్రసాద్, కళ్యాణ్, రాజేశ్వరి, గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్జీ–3లో సీహెచ్‌పీ జీఎం పర్యటన

రామగిరి: సింగరేణి సంస్థ కార్పొరేట్ సీహెచ్‌పీల విభాగం జనరల్ మేనేజర్ తిరుమలరావు సోమవారం ఆర్జీ–3 ఏరియాలో పర్యటించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఆర్జీ–3 ఏరియాకు వచ్చిన సందర్భంగా జీఎం ఎన్.సుధాకర్‌రావు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.